www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 30 నవంబర్ 2024
5

కోనసీమ

అగ్ని ప్రమాద బాధితులకు పరామర్శ

అగ్నిప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ వేగుళ్ల

ప్రజాశక్తి - మండపేట

మండలం ఏడిదలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వ కోల్పోయిన బాధితులు గేదెల వరలక్ష్మి, సిర్రా అన్నపూర్ణ లను కుటుంబాలను శుక్రవారం ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు పరామర్శించారు. సుమారు రూ.6 లక్షల వరకూ ఆస్తినష్టం ఉంటుందని గ్రామస్తులు ఎంఎల్ఎకు తెలిపారు. బాధిత కుటుంబాలకు ఎంఎల్ఎ రూ.5 వేల చొప్పున సాయం చేశారు. గ్రామస్తులు రూ.20 వేలు, 78 కేజీల బియ్యం, కూరగాయలు, నిత్యావసరాలు అందించారు. బాధితులను అన్ని విధాల ఆదుకుంటామని ఎంఎల్ఎ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పి.వీర్రాజు, మేక జేజిబాబు, జి.ఎర్రబ్బు, బి.శ్రీను, చిట్టూరి ప్రసాద్, ఎం.కాళీకృష్ణ, పి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

భారంగా పశుపోషణ

- యంత్రాల ద్వారా మాసూళ్లతో గడ్డి కొరత
- ట్రాక్టర్ గడ్డి రూ.15 వేల నుంచి రూ. 20 వేలు
- ఏడాదికి 18 లక్షల మెట్రిక్ టన్నుల గ్రాసం అవసరం

ట్రాక్టర్‌పై ఎండుగడ్డిని తీసుకువెళుతున్న రైతులు

ప్రజాశక్తి - రాజోలు

పశువుల పెంపకం రైతులకు భారంగా మారుతోంది. ప్రభుత్వ ప్రోత్సాహం కరువవ్వడంతో కూలీల కొరత వేధిస్తోంది. ఎండుగడ్డి తగినంత లేకపోవడం, పచ్చిక బయళ్లు, ఖాళీ బంజరు భూములు తగ్గిపోవడం వంటి కారణాలతో పశువులకు మేత కరువవుతోంది. దీంతో పశు పోషణ రైతులకు భారంగా మారింది. పూర్వం ప్రతి రైతు కమతం గొడ్లశాల, గడ్డివాము, పాడి పశువులతో కళకళలాడేది. నేడు ఏ రైతు మకాం చూసినా కళ్లాలు కళగా కనిపించట్లేదు. పల్లె ప్రజలు సైతం ప్యాకెట్ పాలపైనే ఆధారపడుతున్నారు. గతంలో ఓ సాధారణ రైతుకు వ్యవసాయంతో పాటు పశువుల పెంపకం ద్వారా అదనపు ఆదాయం చేకూరేది. గేదె పాలు ఇంటి అవసరాలకు పోను మిగిలిన పాలు విక్రయించుకోవడం ద్వారా కుటుంబపోషణ జరిగిపోయేది. పల్లె సీమలంటేనే పాడి పంటలకు నెలవు. అటు వంటి పల్లెల్లో వ్యవసాయం కళ తప్పుతోంది.

మూత పడుతున్న పాడిపరిశ్రమలు

జిల్లాలో తెల్లజాతి పశువుల కన్నా నల్లజాతి గోవులే అధికంగా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 2.29లక్షల పాడి పశువులు ఉండగా వాటిలో 1,53,542 గేదెలు, 75,460 ఆవులు ఉన్నాయి. పంజాబ్ నుంచి ముర్రా జాతి గేదెలను ఎక్కువగా దిగుమతి చేయడం జరిగింది. ఒక గేదె (లేదా) ఆవుకు ఏడాది పొడవునా రెండున్నర ఎకరాల వరి చేలో గడ్డి అవసరం అవుతుంది. గేదె/ఆవు సరాసరిన నెలకు 150 లీటర్ల వరకు పాలు ఇస్తుంది. కూలి రేట్లు పెరగడంతో వరి మసూళ్లను యంత్రాలతో చేపట్టారు. ఈ కారణంగా ఎండు గడ్డి దొరకట్లేదు. ఎకరం ఎండుగడ్డి మిషన్‌తో కోసినది అయితే రూ.4 వేలు ఉంది. అదే కూలీలతో కోసినదైతే రూ.10 వేలుపైనే పలుకుతోంది. ఒక గేదె/ఆవుకు ఎండుగడ్డి కోసం రూ.25 వేలు ఖర్చు అవుతుంది. పశువుల కాపరికి రోజు కూలీగా రూ.600 నుంచి రూ.700 వరకు చెల్లించాల్సి వస్తోంది. పచ్చిక భూములు, పుంత భూములు లేకపోవడంతో పశువులకు గ్రాసం కొరత ఏర్పడడంతో దాణాలపైనే ఆధారపడుతున్నారు. గేదె ధర రూ.60 వేల నుంచి రూ.లక్ష వరకు ఉండగా ఆవు ధర రూ.40 వేల నుంచి రూ.60 వేలు వరకు పలుకుతోంది. ఇంత ధర పెట్టి కొనుగోలు చేసినా పాలు దిగుబడులు లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. పాలుకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో పాడి పరిశ్రమలు కూడా మూతపడుతున్నాయి.

ప్రకటనలకే పరిమితమైన ప్రభుత్వాలు

పాడి పరిశ్రమకు పెద్దపీట వేస్తున్నామని చెప్పే ప్రభుత్వాలు కేవలం ప్రకటనలకే పరిమితయ్యాయనే ఆరోపణలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. గతంలో సైలేజ్ గడ్డిని రైతులకు సబ్సిడీపై అందించేవారు. ప్రస్తుతం ఇవ్వట్లేదు. పశుక్రాంతి పథకం ద్వారా సన్న, చిన్నకారు రైతులకు పాడి పశువులకు రాయితీ అందించే పథకానికి మంగళం పాడేశారు. పాడి పరిశ్రమ ప్రోత్సాహానికి సంక్రాంతి పర్వదినాల్లో పాల పోటీలు, పశువుల అందాల పోటీలు నిర్వహించేవారు. నాలుగేళ్లుగా వాటి ఊసేలేదు.పశువులు మరణిస్తే భీమా వర్తించట్లేదు. పశు సమగ్ర క్షేత్రాలు, పశుగ్రాసం కోసం ఇచ్చే ప్రోత్సాహం నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో పాడి పశువుల పెంపకం రైతులకు గుదిబండలా మారింది. తద్వారా పశువుల సంఖ్య గణనీయంగా తగ్గి భవిష్యత్తులో పాడి పరిశ్రమ కనుమరుగై కత్రిమ పాలు, ప్యాకెట్ పాలకే పరిమితమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం మాత్రం ఇపుడు సైలేజ్ గడ్డి స్థానంలో టోటల్ మిక్స్‌డ్ దాణా, సమీకత దాణా అందిస్తోంది.

ఏడాదికి 18 లక్షల మెట్రిక్ టన్నుల పశుగ్రాసం అవసరం !

ప్రతి పంటలోను ఎండుగడ్డి మాసూళ్ల రైతు లకు సవాల్‌గా మారుతోంది. ఒకవైపు పంట మాసూళ్లతో పాటు మరోవైపు పశువుల కోసం ఎండుగడ్డి మాసూళ్ల కత్తిమీద సాములా మారింది. తుపాను కారణంగా కురిసిన వర్షాలకు చాలాశాతం ఎండుగడ్డి పొలాల్లో తడిచిపో యింది. 2.29లక్షల పాడి పశువులు ఉండగా వాటిలో 1,53,542 గేదెలు, 75,460 ఆవులు ఉండగా ఏడాదికి ఎండి పశు గ్రాసంగా సుమారు 18 లక్షల మెట్రిక్ టన్నులు కావాల్సి ఉంటుంది. ఈ ఏడాది రెండు లక్షల 52 వేల ఎకరా ల్లో సార్వా సాగు సాగాల్సి ఉండగా 1.69 లక్షల ఎకరాల్లో మాత్రమే వరిసాగు సాగింది. ఇప్పటి వరకు మాసూళ్లు అయిన ఎండుగడ్డి నాలుగు నెలలకు మించి సరిపోదని రైతులు అంటున్నారు. గత పంటలో ట్రాక్టర్ ఎండుగడ్డి రూ.6వేలు ఉంటే ఈసారి రూ.8 వేల నుంచి రూ.10 వేలు వరకు అమ్ముతున్నారు. మిషన్ ద్వారా చుట్టిన మోపు రూ.35కు అమ్ముతున్నారు. తుపానులు, అకాల వర్షాలతో ఏడాదిలో సార్వా, దాళ్వా, పంటల్లో సగం గడ్డి మాత్రమే మాసూళ్ల చేయగలుగుతున్నారు.

పశువుల పెంపకం భారంగా మారింది

పాడి పశువుల పెంపకానికి ట్రాక్టర్ ఎండు గడ్డి ఇప్పుడు రూ.13 వేలు అయ్యింది. పశువులకు వాడే తవుడు క్వింటాలు రూ.3,200కి చేరింది. మొక్క జొన్న పిండి 50 కిలోలు రూ.1,200కి పెరిగింది. జొన్నల ధర 100 కిలోలు రూ.1,600 నుంచి రూ.3,200కి పెరిగింది. దాంతో పాటు పశుగ్రాసాలు, కూలి రేట్లు పెరగడంతో పశువుల పెంపకం గిట్టుబాటు కావట్లేదు. పెరిగిన ముడిసరుకు, పశువుల దాణా ధరలు తగ్గించి పాడి పరిశ్రమను ప్రోత్సహించాలి.

-కలిగితి చంటి , పాడి రైతు, శివకోడు

ట్రాక్టరు ఎండు గడ్డి ధర రూ.15 వేలు

నాకు నాలుగు పశువులు ఉన్నాయి. వీటిని కాపాడుకోవటానికి ఇప్పటికే రెండు సార్లు పశుగ్రాసాన్ని కొనుగోలు చేశా. ట్రాక్టరు ధర రూ.15 వేలు చెబుతున్నారు. ఇంత మొత్తంలో చెల్లించి పశుగ్రాసాన్ని కొనుగోలు చేయడం ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్థిక భారంతో కూడుకున్నదే. పశువులను కాపాడుకోవడానికి ఎక్కువ ధరకు పశుగ్రాసాన్ని కొనుగోలు చేయక తప్పలేదు. ఇప్పటికైనా అధికారులు స్పం దించి పశు గ్రాసాన్ని తక్కువ ధరకు అందించేలా చూడాలని కోరుతున్నా.

– గెడ్డం భాస్కరరావు, పాడి రైతు, రాజోలు మండలం

తుపాను ప్రభావంతో భారీ వర్షాలు


ద్రాక్షారామ-రామచంద్రపురం రోడ్డులో భారీ వర్షం

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఫెంగల్ తుఫానుగా మారి దాని ప్రభావంతో శుక్రవారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షాలుకురుస్తున్నాయి. దీంతో మెయిన్ రోడ్లన్నీ జనసంచారం లేక కర్ఫ్యూ వాతావరణం తలపించాయి. మరోవైపు ముమ్మరంగా కొనసాగుతున్న తొలకరి పంట మాసూలు పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో పాటుగా ధాన్యం ఎగుమతులను రైతులు నిలిపివేశారు. మెయిన్ రోడ్ల వెంబడి ఉన్న ధాన్యం రాశులకు బరకాలు కప్పారు. ట్రాక్టర్లపై ఎగుమతికి సిద్ధంచేసిన ధాన్యం బస్తాల పైన టార్పాలిన్లు, బరకాలు కప్పారు. ఇప్పటికే 90 శాతం వరి కోతలు పూర్తి కావడంతో మరొక్క పది శాతం మాత్రమే మిగిలి ఉన్నాయి. ఇక ధాన్యం మరో 60 శాతం వరకు ఎగుమతులు కావాల్సి ఉంది. వాళ్ళచోట్ల రైతులు ధాన్యం రాశులుగా పోసి ఆరబెట్టుకుంటున్న సమయంలో తుపాను కారణంగా వర్షాలు కురవడంతో బరకాలి కప్పి ఉంచారు. తుపాను ప్రభావంతో మరో రెండు మూడు రోజులు పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది.

ముమ్మిడివరం మండలంలో ధాన్యాన్ని ఆరబెట్టిన రైతులు

తీవ్ర ఆందోళనలో రైతులు

ముమ్మిడివరం: రైతులు ఆరుగాళం కష్టించి పండించిన పంటలు చేతికి వచ్చే సమయంలో తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మండలంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి వర్షాలు పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక పక్క కళ్లాల్లో ఉన్న ధాన్యం రాశులను ఆరబెట్టుకుంటున్న రైతులు, వర్షం ప్రభావంతో హడావుడిగా వాటిని రాశులు చేసే పనిలో పడ్డారు. తుపాను నేపథ్యంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు రైతులను అప్రమత్తం చేశారు.

దింపు కార్మికులను ఆదుకోవాలి : సిఐటియు

ఉద్యానపరిశోధన కేంద్రంలో కార్మికుల గురించి మాట్లాడుతున్న సిఐటియు బృందం

ప్రజాశక్తి - అంబాజీపేట

కొబ్బరి దింపు కార్మికులకు ప్రభుత్వం, యాజమాన్యం ఆదుకోవాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. కోకోనట్ రీసెర్చ్ స్టేషన్ హైబ్రిడ్ కొత్త వంగడం తయారీలో పని చేస్తున్న వ్యక్తి నాలుగు రోజుల క్రితం కొబ్బరి చెట్టుపై నుంచి పడిన కొబ్బరి కార్మికుడు బొక్కా వెంకట నగేష్ బాబు నడుము విరిగి హాస్పిటల్ చికిత్స పొందుతున్నారు. ప్రమాద సంఘటన ప్రాంతాన్ని సిఐటియూ జిల్లా అధ్యక్షులు జి.దుర్గా ప్రసాద్, కార్యదర్శి ఎన్.బలరామ్ శుక్రవారం వెళ్లి అంబాజీపేట ఉద్యాన పరిశోధనా కేంద్రం అధిపతి ఎన్‌బివి.చలపతిరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్మికులకు కొబ్బరి చెట్లు ఎక్కు మిషన్లు, యంత్రాలు ఇవ్వాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. గుంటూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకట నగేష్‌బాబుకి ప్రభుత్వం, యాజమాన్యం అన్ని విధాలా ఆర్థిక చేయూత నిచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలా లేని పక్షంలో సిఐటియూ ఆద్వర్యంలో ఆందోళన చేపట్టవలసి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అంబాజీపేట మండలం సిఐటియు కన్వీనర్ బిరా ఎస్తేర్ రాణి, బి.సోమశేఖర్, వాసంశెట్టి లక్ష్మీ ప్రసన్న, ఈశ్వరరావు, ఈతకోట వెంకటేశ్వరరావు, నీతిపూడి ఏడుకొండలు, సబ్బతి శ్రీను, శాఖ రాంబాబు, జయప్రకాష్,మాతా శ్రీనివాసరావు, జంగా సునీల్ సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి జనసేన నాయకుల పరామర్శ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలి పోయి నిరాశ్రయులైన బాధితురాలి కుటుంబానికి జన సేన అండగా ఉంటుందని జన సైనికులు పేర్కొన్నారు. మండలంలోని ఠాణే లంక గ్రామానికి చెందిన కొప్పిశెట్టి భూలక్ష్మికి చెందిన ఇల్లు అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. బాధితురాలి కుటుం బాన్ని శుక్రవారం జనసేన నాయకులు పరామర్శించి, ప్రమాద కారణాలను అడిగి తెలుసుకుని బాధితురాలికి రూ.ఐదు వేలు ఆర్థిక సాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో గుద్దటి జమ్మి, గోదాశి పుండరీష్, విత్తనాల అర్జున్, పితాని శివ, యలమంచిలి బాలరాజు, వనచర్ల బాలకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - మలికిపురం

లక్కవరానికి చెందిన జిల్లా టెలికాం సలహా మండలి మాజీ సభ్యుడు రుద్రరాజు గోపాల కృష్ణంరాజు రాజోలు డివిజన్లో టెలికం వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల ను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం బిఎస్ఎన్ఎల్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా టెలికం ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ రాజును రాజమహేంద్రవరంలో గోపాలకృష్ణంరాజు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. 3జి నుంచి 4జికి మారినప్పటికీ సిగ్నల్ సరిగ్గా రావడం లేదని, కాల్ కట్ అవటం, నెట్ పనిచేయక పోవటం వంటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయని వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

కార్టూ'నిజం'



ప్రత్యేక హోదా మౌఖిక హామీయే

రాతపూర్వకంగా ఇవ్వలేదు • హైకోర్టుకు తెలిపిన కేంద్రం

కోర్టులు జోక్యం చేసుకోవడానికి వీల్లేదని వాదన

ఇసుక తవ్వకాలపై కలెక్టర్ సమీక్ష

మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్, పాల్గొన్న జెసి టి.నిషాంతి తదితరులు

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం సభ్యులతో శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించి ఇసుక రీచ్‌ల వారీగా ఇసుక తవ్వకాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ఇసుక రీచ్ ల ద్వా రా రోజువారీగా 20 వేల మెట్రిక్ టన్నులు ఇసుక తవ్వకాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కపిలేశ్వరపురం తాటిపూడి రీచులలో నీటి ప్రవాహం ఇంకా కొనసాగుతోందని రామచంద్రపురం ఆర్‌డిఒ డి.అఖిల కలెక్టర్ దష్టికి తీసుకువెళ్లారు. నీటి ప్రవాహం తగ్గిన వెంటనే నిర్దేశిత ఆపరేటింగ్ ఏజెన్సీల ద్వారా ఇసుక త్రవ్వకాలు ప్రారంభించాలని ఆదేశించారు. రోజువారీగా ఒక్కొక్క రీచ్ నుంచి సుమారుగా 500 మెట్రిక్ టన్నులు ఇసుక తవ్వకాలు చేపట్టాలని సూచించారు. నార్కెడుమిల్లి, ఆలమూరు పొడగట్లపల్లి రీచుల్లో డిసెంబర్ 1వ తేదీ నుంచి తవ్వకాలు ఆపరేటింగ్ ఏజెన్సీల ద్వారా చేపట్టాలన్నారు. ఆపరేటింగ్ ఏజెన్సీలు తవ్వకాల కొరకు ముందుకు రానిపక్షంలో నోటీసులు జారీ చేస్తూ సంప్రదింపులు జరిపి వివరణ కోరాలని ఆర్‌డిఒలకు సూచించారు. ఆపరేటింగ్ ఏజెన్సీలకు ఏవైనా సమస్యలు ఉంటే గుర్తించాలని సూచించారు రీచ్‌లల నుంచి స్టాక్‌యార్డ్‌కు, స్టాక్‌యార్డ్ నుంచి వినియోగదారులకు ఎంత పరిమాణంలో ఇసుక విక్రయించబడుతుందో రోజువారి నివేదికను సమర్పించాలని ఆదేశించారు. భవన నిర్మాణ రంగాలకు అవసరమైన డిమాండ్‌కు అనుగుణంగా ఇసుకను సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కపిలేశ్వరపురం-2 నుంచి స్థానికంగా వినియోగం కొరకు ఎంత పరిమా ణంలో ఇసుకను తరలిస్తున్నది పంచాయతీ సిబ్బంది పర్యవేక్షించాలన్నారు. సొంత వినియోగానికి తరలిస్తున్నారా లేదా నిబంధనలకు విరుద్ధంగా మూడో వ్యక్తికి విక్రయిస్తున్నది నిశితంగా గమనించి అక్రమ రవాణా పై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. పట్టా భూములలో ఇసుక ఎంత పరిమాణంలో ఉందో అధికారుల ద్వారా అంచనాలు వేసి ఆ మేరకు ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లలో తరలించుకు నేందుకు అనుమతులు గ్రామ సచివాలయాల స్థాయిలో ఇవ్వాలని సూచించారు. పట్టా భూముల్లో ఇసుక నిల్వలు ఉన్నాయని దరఖాస్తు చేసుకున్న వారికి జియో కోఆర్డినేట్లతో డిజిపిఎస్ సర్వే, ఎఫ్ఎంసి సర్వేలను పూర్తి చేసి అప్రూవల్స్, డిసెంబ ర్ 6వ తేదీ నాటికి తదుపరి పర్యావరణ అను మతులు జారీ చేయాలన్నారు. స్థానిక వినియోగదారులు పోస్ట్ ఆడిట్ ద్వారా డెలివరీ సమాచారం అందుతుందని, సాధారణ, బల్క్ వినియోగదారులకు ఇసుక డిస్పాచ్ అనంతరం సమాచారం జనరేట్ అవుతుందన్నారు. ఇసుక స్థానిక అవసరాలకు వినియోగి స్తున్న తీరును పంచాయతీ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జెసి టి.నిషాంతి, జిల్లా గనులు భూగర్భ శాఖ ఎడి ఎల్.వంశీధర్ రెడ్డి, ఆర్‌డిఒలు డి.అఖిల, కె.మాధవి, పి. శ్రీకర్, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ శంకర్రావు, జిల్లా రవాణా అధికారి డి.శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ సిహెచ్ఎన్‌వి.కృష్ణారెడ్డి, ఆర్అండ్‌బి ఎస్ఇ బి.రాము, జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు, రియాల్టీ ఇన్‌స్పెక్టర్ టి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

గొల్లవిల్లిలో సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

సిసి రోడ్డు పనులు పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- ఉప్పలగుప్తం

గొల్లవిల్లిలో సిసి రోడ్డు నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. గొల్లవిల్లి నుంచి కాలువ గట్టు మీదగా వాడపర్రుకు వెళ్లే రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. పూర్తిస్థాయిలో వాడపర్రు పంట కాలువ గట్టుకు ఉన్న సిసి రోడ్డు ప్రధాన ఆర్అండ్‌బి రహదారి కలిసే చోట సుమారు 110 మీటర్ల సిసి రోడ్డు మిగిలిపోయింది. దీంతో ఆ కొంచెం సి సి రోడ్డు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఇటీవల ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావుకు స్థానిక నాయకులు వివరించారు. దీంతో ఉపాధి హామీ చట్టం నిధులు రూ.9 లక్షలు రోడ్డు అభివద్ధికి ఎంఎల్ఎ ఆనందరావు నిధులు మంజూరు చేశారు. దీంతో రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. సిసి రోడ్డు పను లను స్థానిక సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ, చిన్ని, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు చీకట్ల ఏసు బాబు, జనసేన నాయకుడు మంచెం బాల కృష్ణ తదితరులు పరిశీలించి నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎంఎల్ఎ దేవ వరప్రసాద్

సిఎం సహాయ నిధి పేదలకు పెన్నిధి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి- రాజోలు

సిఎం సహాయ నిధి పేదలకు పెన్నిధని రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ అన్నారు. రాజోలు నియోజకవర్గ పరిధిలోని సిఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు శుక్రవారం మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం వద్ద 36 మంది బాధిత కుటుంబాలకు రూ.34.60 లక్షల విలువగల చెక్కులు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ వరప్రసాద్ మాట్లాడుతూ వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సిఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నారన్నారు. చెక్కులు అందుకున్న వారు మాట్లాడుతూ వైద్య సహాయం కోసం సిఎం చంద్రబాబు అందించిన నిధులు తమకు అందేలా కషి చేసిన ఎంఎల్ఎ దేవ వర్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎపి మార్క్ ఫెడ్ డైరెక్టర్ జి.పెదకాపు, జనసేన రాష్ట్ర నాయకులు గెడ్డం మహలక్ష్మీ ప్రసాద్,తాడి మోహన్, రాజోలు జనసేన మండల పార్టీ అధ్యక్షులు సూరిశెట్టి శ్రీను, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

ప్రజాశక్తి - అల్లవరం

తూర్పు లంక గ్రామంలో ఉచితంగా పశువులకు గర్భకోశ వ్యాధులు చికిత్స, వ్యాధి నిరోదక టీకాలు శిభిరం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. బిసి కార్పోరేషన్ డైరెక్టర్ కడలి వేంకటేశ్వరావు, తూర్పులంక గ్రామ సర్పంచ్ కడలి గంగాచలం, జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ కొమ్మ వెంకట్రావు, సహాయ సంచాలకులు డాక్టర్ విజయ రెడ్డి ఈ శిబిరానికి హాజరయ్యారు. పశువులకు ఉచితంగా సూడి పరీక్షలు, తిరిగి పోలుతున్న పశువులకు గర్భకోశ వ్యాధులు చికిత్స, ఎ దలో ఉన్న పశువులకు కతిమ గర్భదారణ పరీక్షలు, పెయ్యి దూడలకు 4 నెలలు నుంచి 8 నెలలు దూడాలకు బ్రుసెలోసిస్ వ్యాధినిరోధక టీకాలు, కోళ్లకు వ్యాధి నిరోధక టీకాలు వేశామన్నారు.. ఈ కార్యక్రమంలో అల్లవరం పశు వైద్యవైద్యధికారి డాక్టర్ మేడిద నారాయణరావు, డాక్టర్లు కళ్యాణి, మాధురి, శివతేజ, పశు సంవర్థక సహాయకుడు రాజీవ్, పాడి రైతులు పాల్గొన్నారు.

హై స్కూల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

254 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - కె. గంగవరం

కె.గంగవరం ఉన్నత పాఠశాలలో 254 మంది విద్యార్థులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. అందరికీ రక్త పరీక్షలు చేశారు. వారిలో 54 మంది బాలికలకు రక్తహీనత ఉన్నట్లుగా వైద్యులు గుర్తించారు. వారికి ఐరన్ టాబ్లెట్లు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక వైద్యులు ఎస్ఎంసి ఛైర్మన్ పెంటపాటి శివన్నారాయణ మాట్లాడుతూ విద్యార్థుల్లో రక్తహీనత లేకుండా చూసుకోవాలని, రక్తహీనత వల్ల అనేక వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. గుడ్లు, పాలు, ఆకుకూరలు బెల్లం వంటి పదార్థాలు తీసుకోవడం వల్ల రక్తహీనతను తగ్గించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి వెంకటేశ్వరరావు, పివి బ్రహ్మానందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రీ సైక్లింగ్‌పై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - మలికిపురం

వివేకానంద ఉన్నత పాఠశాల వద్ద వన్ యం వన్ బి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం వేస్ట్ రీసైక్లింగ్ అంశాలపై విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. వన్ యం వన్ బి స్టేట్ ఇన్చార్జ్ సాగర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థుల్లో ఫ్యూచర్ స్కిల్ డెవలప్మెంట్, మరియు పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి, ఈవేస్ట్ రీసైక్లింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

ఆర్‌బికెలో రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని మర్లపాలెం రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం ఎంపిడిఒ బికెఎస్ఎఫ్. వెంకటరామన్ రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలిం చారు. అనంతరం ఆయన రైతులను కలిసి తుపాను ప్రభావం వల్ల వారు ఎదుర్కొంటున్న ఇబ్బం దులను రైతుల ఇబ్బందులు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వై.విజయ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, మరియు అగ్రికల్చర్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ముమ్మిడివరం ఎంపిడిఒ తాడి వెంకటాచారి సూచించారు. మండలంలో పలు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను ఎంపిడిఒ వెంకటాచారి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలు తీసుకువచ్చిన ధాన్యానికి 17 శాతం తేమ ఉంటే నిబంధనల మేరకు కనీస మద్దతు ధర చెల్లించాలని సూచించారు. అనంతరం ధాన్యం కొనుగోలు చేసిన రికార్డులను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు లో పూర్తి పారదర్శకతతో సిబ్బంది పని చేయాలని సూచించారు. దీనిలో భాగంగా రాజుపాలెం, ఠానేలంక, పళ్ళ వారిపాలెం మరియు కొత్తలంక పరిధిలోని రైతు భరోసా కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన వెంట వ్యవసాయ అధికారి ఎస్ ప్రశాంత్ కుమార్ వ్యవసాయ సహాయకులు మరియు పిపిసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి: ఎంపిడిఒ

అల్లవరం: ఇప్పటికే కోసి ఆరబెట్టిన ధాన్యాన్ని వెంటనే రైతు సేవా కేంద్రం కు ట్యాగ్ చేసిన రైస్ మిల్లు కు తరలించాలని ఎంపిడిఒ బి.కృష్ణ మోహన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కొమరగిరిపట్నం, తుమ్మలపల్లి, మొగళ్ళమూరు, బెండమూరు లంక దాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపిడిఒ పరిశీలించారు. బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో వరి పంట స్టాండింగ్ క్రాప్ లో ఉన్నట్లు అయితే రైతులు ఈ ఐదు రోజుల్లో కోయకుండా వాయిదా వేయాలి అని వాతావరణం సాధారణ పరిస్థితికి వచ్చాక రైతులు వరి కోత చేపట్టాలన్నారు. ఇప్పటికే చేతికోతగా పంట కోసి పనలపై ఉంటే వాటిని సురక్షిత ప్రదేశాల్లో తడవకుండా భద్రపరచుకోవాలన్నారు. రైతులకు అవగాహన కల్పించి రైతు సేవా కేంద్రాల్లో రికార్డులు పరిశీలించి గన్ని బ్యాగ్స్ రైతులకు ఇవ్వాలన్నారు. సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ శుభ గణేష్, బెండమూర్లంక విఆర్ఓ మెట్ల బాబ్జీ, విఏఎలు మేఘన, విజయ, ధన, రైతులు పాల్గొన్నారు

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - రావులపాలెం

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో సెయింట్ పాట్రిక్స్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఇటీవల రామచంద్రపురంలో కరాటే సంస్థ నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో ప్రతిభ కనబరిచినట్లు గ్రాండ్ మాస్టర్ టి.అబ్బులు, స్కూల్ యాజమాన్యం కమ్యూనిటీ లీడర్ బ్రదర్ ఫెలిక్స్ అరుణ్, ప్రిన్సిపల్ మను మాధ్యు శుక్రవారం తెలిపారు. బాలుర ఏ విభాగంలో ఆరేటి కీర్తి అక్షయ్ గోల్డ్ మెడల్, బి విభాగంలో కొప్పుల శ్రీ శశాంక్ సిల్వర్ మెడల్, బాలికల ఏ విభాగంలో వీరవల్లి దేదీప్య గోల్డ్ మెడల్, బి విభాగంలో ఎలిశెట్టి సాన్వి సిల్వర్ మెడల్, బి విభాగంలో కొప్పుల శ్రీ సర్వాన్ బ్రాంజ్ మెడల్ సాధించినట్లు వారు తెలియజేశారు. ఈ సందర్భంగా కోచ్‌లు టి.వెంకటలక్ష్మి, టిఎస్-ఎల్.కిరణ్, ఉపాధ్యాయులు తదితరులు విద్యార్థులను అభినందించారు.

అభినందిస్తున్న పాట్రిక్స్ స్కూల్ యాజమాన్యం

చేనేత సహకార సంఘాల అభివృద్ధికి రుణాలు

జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లాలో 19 చేనేత సహకార సంఘాలకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా క్యాష్ క్రెడిట్ రుణాల మంజూరు కోరుతూ రూ.13 కోట్ల16 లక్షలతో రూపొందించిన ప్రతిపాదనలకు కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ కమిటీ సభ్యులు అనుమతితో ఆమోద ముద్ర వేశారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లాస్థాయి చేనేత సహకార సంఘాల కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి చేనేత సహకార సంఘాల అభివృద్ధి రుణాల కల్పన చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం వంటి పలు విషయాలపై కమిటీ సభ్యులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి సంఘం ఆర్థిక పరిపుష్టికి రుణ పరపతిని కల్పిస్తూ చేనేత సంఘాల బలోపేతానికి చేనేత రంగాన్ని లాభదాయకంగా మార్చుకుని జీవన ప్రమాణాలను మెరుగు పరుచుకునే విధంగా తమ వంతు భాగస్వామ్యం వహించాలని కమిటీ సభ్యులకు సూచించారు. మగ్గాలకు ఆధునిక సాంకేతికతను జోడించి ఉత్పాదకతను మరియు నాణ్యత తోపాటు సమయాన్ని ఆదా చేసుకునే విధంగా సంఘాలకు తోడ్పాటును అందించాలన్నారు. చేనేత వృత్తి పై ఆధారపడి జీవిస్తున్న చేనేత కార్మికులకు సంక్షేమానికి వివిధ దశల్లో అండగా నిలిచి చేనేత వృత్తిని లాభదాయకంగా తీర్చిదిద్దుకునేందుకు ప్రభుత్వపరంగా భరోసాను కల్పించాలని కమిటీ సభ్యులకు సూచించారు. చేనేత వత్తిని జీవనాధారంగా చేసుకున్న చేనేత కార్మికులను సామర్ధ్యాలను అంచనా వేస్తూ ఆ దిశగా ప్రభుత్వ రాయితీలతో ప్రోత్సహించాలని సూచిం చారు. జిల్లా వ్యాప్తంగా 9 మండలాల పరిధిలో 23 సొసైటీలు ఉన్నాయని వీటి అభివృద్ధికి సహకరం చాలని ఆయన సూచించారు. పెట్టుబడి వ్యయం, రాబడి, నికర లాభాలను బేరీజు వేస్తూ చేనేత గిట్టుబాటు ధరలు కల్పన కొరకు మార్కెటింగ్ సౌలభ్యం కల్పించాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఆధునిక పోకడలను మార్కెట్లో చేనేత వస్త్రాలపై ప్రస్తుతం ఉన్న అభిరుచులను పరిగణనలో తీసుకుని ఆ దిశగా పైలెట్ ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తూ చేనేత రంగ అభివృద్ధికి పాటుపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు కె.పెద్దిరాజు, జిల్లా సహకార అధికారి రాధాకృష్ణ, వీవర్స్ సర్వీసెస్ సంఘం విజయవాడ ప్రతినిధి నాగేశ్వరరావు, ఆర్‌డిడిసి బి.ధనుంజయ్, ఆప్కో ప్రతినిధి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

నేరాలు ఘోరాలు

బంగారు గొలుసు చోరీ

ప్రజాశక్తి- మామిడికుదురు

మామిడికుదురులో ఒక మహిళ మెడలో శుక్రవారం పట్టపగలే గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేశాడు. వివరాలు ఇవి.. అడబాల శేషకుమారి మెడలో ఆరుకాసుల బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి ఇంటికి వచ్చి పట్టపగలే ఆమె మెడలో గొలుసు చోరీ చేశాడు ఆమె కేకలు వేయడంతో కిందికి తోసేసి గోడ దూకి పారిపోయాడు . పెనుగులాట సందర్భంలో చోరీకి పాల్పడిన దొంగకి సంబంధించిన సెల్ ఫోను కిందపడిపోయింది. నగరం ఎస్ఐ చైతన్య కుమార్ సంఘటనా స్థలాన్ని చేరుకుని విచారణ చేపట్టారు. ముగ్గురు చోరీకి పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఎక్సైజ్ అధికారులు విస్తృత దాడులు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని లంకల పరివాహక ప్రాంతాలలో శుక్రవారం కొత్తపేట ఎక్సైజ్ కార్యాలయం సిబ్బంది నాటుసారా స్థావరాలపై విస్తృత దాడులు నిర్వహించారు. ఈ దాడులలో సారా విక్రయించేందుకు తీసుకెళుతున్న వెలిచేరు గ్రామానికి చెందిన నిచ్చెన కోళ్ళ నాగరాజును అదుపులో తీసుకున్నారు. అతని వద్ద నుండి 10 లీటర సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు కొత్తపేట ఎక్సైజ్ ఎస్ఐ కాత్యాయని తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ కె.అన్నవరం, ఇబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడుల్లో ముగ్గురు అరెస్ట్

ఆలమూరు : స్థానిక ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన దాడుల్లో మద్యం, నాటు సారా అమ్మకాలు నిర్వహిస్తున్న ముగ్గురిపై కేసులు నమోదు చేశారు. ఎక్సైజ్ సిఐ ఐ.డి.నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక సర్కిల్ పరిధిలోని మండపేట మండలంలోని ద్వారపూడికి చెందిన మట్ట వెంకటలక్ష్మి, కేశవరంకు చెందిన గుండిమేని త్రివేణి నాటు సారా అమ్మకాలు చేస్తుండగా వారు వద్ద నుంచి 10 లీటర్లు నాటు సారా స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే ఆలమూరు మండలంలోని చెముడులంకలో అక్రమ మద్యం అమ్మకాలు చేస్తున్న నాగిరెడ్డి మల్లయ్య నుంచి 26 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్ళరేవు రెడ్డివారి పేట సమీపంలో జాతీయ రహదారి 216పై బైపాస్‌లో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఒక ప్రైవేట్ ట్రావెల్ బస్సును పాల వ్యాను ఢీ కొట్టి అదుపుతప్పి ముందు వెళుతున్న బైకును ఢీకొంది. దీంతో బైకుపై వెళుతున్న అమలాపురానికి చెందిన ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108లో కాకినాడ ప్రభుతాసుపత్రికి తరలించారు.

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

మర్లావ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జునరావు తెలిపారు. గండేపల్లి మండలం బొర్రంపాలెంలో నిర్వహించిన దాడుల్లో ఒక వ్యక్తి నుంచి అక్రమంగా నిలవజేసిన 8 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు ప్రసాదరావు, పి.చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి చోరీపై పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-తాళ్లరేవు

పి.మల్లవరంలో వెంకటేశ్వర స్వామి ఆలయం ఎదురుగా గల స్థలంలో మట్టిని అక్రమంగా తవ్వి కొందరు వ్యక్తులు తరలించారని బాధితులు ధూళిపూడి నరసింహారావు, వెంకట సూర్యనారాయణ శుక్రవారం కోరంగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ తండ్రి వారసత్వంగా సంక్రమించిన ఐదున్నర సెంట్ల స్థలంలో సుమారు 6 అడుగుల మేర మట్టిని తవ్వేసి కొందరు దౌర్జన్యంగా తరలించారని బాధితులు ఆరోపించారు. ఆ స్థలానికి సంబంధించి సర్వే నిర్వహించాలని సర్వే పూర్తయ్యే వరకు ఎవరు ఆ భూముల్లోకి ఎవరు వెళ్ళకూడదని కోరింగ్ ఎస్.ఐ.పి.సత్యనారాయణ చెప్పినట్టు బాధితులు విలేకరులకు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న ఆటో ఆరుగురికి గాయాలు

ప్రజాశక్తి-ఏలేశ్వరం

మండలంలోని ఎర్రవరం సిపిఎఫ్ ఫ్యాక్టరీ వద్ద జాతీయ రహదారిపై ఆటో శుక్రవారం డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు జీడి పిక్కల ఫ్యాక్టరీ మహిళా కార్మికులు గాయాల పాలయ్యారు. మూసివేసిన దీపిక ఫ్యాక్టరీని తెరిపించాలని గత 14 రోజులుగా ఆందోళన నిర్వహిస్తున్న కార్మికులు శుక్రవారం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారి స్వగ్రామమైన పెద్దనాపల్లికి ఆటోలో వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గాయపడిన వారిలో పెద్దనాపల్లికి చెందిన కప్పల దేవి, కీర్తి రత్నకుమారి, కీర్తి నాగమణి, బుద్ధ రాణి, శరకణం భూలక్ష్మి, శరణం జగవేణి ఉన్నారు. వీరిని నేషనల్ హైవే అంబులెన్స్‌లో ప్రతిపాడు తరలించారు. ఎస్ఐ ఎన్.రామలింగేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సినీ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ పై ఫిర్యాదు

ప్రజాశక్తి - అమలాపురం

సినీ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ గత ఏడాది జనవరి 8వ తేదీన ట్విట్టర్ వేదికగా సామాజిక మాధ్యమాల్లో "కాపు' సామాజిక వర్గంపై చేసిన వ్యాఖ్యల పట్ల కాపునాడు తీవ్ర నిరసనను వ్యక్తం చేసింది. ఈమేరకు రామ్ గోపాల్ వర్మపై బియన్‌యస్ 196 సెక్షన్, ఇతర సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలని కోరుతూ అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్లో రాష్ట్ర కాపునాడు వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బిరెడ్డి సురేష్ పిలుపుమేరకు సంయుక్త కార్యదర్శి అబ్బిరెడ్డి శ్రీరామ్మూర్తి, కాపునాడు సంఘీయులు శుక్రవారం ఫిర్యాదు చేశారు.కాపులందరి వ్యక్తిత్వ హననానికి పాల్పడిన రామగోపాల్ వర్మపై చట్టపరమైన కఠిన చర్యలు చేపట్టి తగిన శిక్షలు విధించాలని ఆ ఫిర్యాదులో కోరారు. ఈ కార్యక్రమంలో కాపునాడు నాయకులు గంగుమళ్ళ శ్రీనివాస్, పత్తి దత్తుడు, తోట శ్రీను, అడబాల తాత కాపు, విళ్ళ సుబ్బారావు, గుండాబత్తుల తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

వద్దిపర్రు లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

తుపాను హెచ్చరికలతో రైతులు అప్రమత్తం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

బంగాళాఖాతంలో ఏర్పడ్డ తుపాను ప్రభావంతో శుక్రవారం ఆకాశమంత మబ్బులు కమ్మేయడంతో చిరుజల్లులు పడడంతో రైతులు అప్రమత్తమయ్యారు. వ్యవసాయ అధికారులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని చెప్పినప్పటికీ వాతావరణం మబ్బులతో కాస్త ఎండగా ఉండడంతో రైతులు యంత్రాలు సాయంతో వరి నూర్పుడులు చేసుకుంటున్నారు కొంతమంది రైతులు. రోడ్లపై ధాన్యాన్ని ఆరబెట్టుకునే పనులు నిమగ్నమై ఉన్న వాతావరణ మార్పులతో ఆందోళన చెందుతున్నారు. కొంతమంది రైతులు ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ధాన్యంలో తేమ శాతం ఉన్న మిల్లర్లు ధాన్యాన్ని కొనుగోలు చేయడంతో కొంతమంది రైతులు ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నారు. మండలంలోని గ్రామాలలో తుపాను ప్రభావం అంతగా లేనప్పటికీ ఆకాశం మేఘవంతమై ఉండడంతో పాటు శుక్రవారం సాయంత్రం చిరుజల్లులు పడ్డాయి. వ్యవసాయ అధికారి భార్గవ్ మహేష్ పలు గ్రామాలలో ధాన్యపు రాశులను పరిశీలించారు. తుపాను ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోళ్ల పరిశీలన

ప్రజాశక్తి - అంబాజీపేట

తుపాను కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తహశీల్దార్ జె.వెంకటేశ్వరి శుక్రవారం ముక్కామల సందర్శించి ధాన్యం కొనుగోలను పరిశీలించారు. ధాన్యాన్ని ముక్కామల శ్రీ లక్ష్మీ శ్రీనివాస ట్రేడర్స్ మిల్లుకు తరలించాలని సూచించారు. మిల్లు ఆవరణలో ధాన్యం రాశులు పరిశీలిం చారు. ఆమె వెంట వ్యవసాయ శాఖాధికారి సిహెచ్‌డి.విజయ్ కుమార్, సొసైటీ సిఇఒ పిఎన్ఎస్ బివి.వెంకటేశ్వరరావు(నాగబాబు) రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. పంట సంరక్షణ చర్యలపై సూచనలు ఇచ్చారు.

ముక్కామలలో రైస్ మిల్లు వద్ద ధాన్యాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్

పోలీసుల సమక్షంలో బంగారం వస్తువుల బ్యాగ్ మహిళకు అందజేస్తున్న ఆటో డ్రైవర్

ప్రయాణికురాలికి బ్యాగ్ అందజేత

ప్రజాశక్తి - రావులపాలెం

ఆటోలు ప్రయాణం చేసిన మహిళ తన బ్యాగ్‌ను మరచి వెళ్లిపోవడంతో శుక్రవారం డ్రైవర్ బ్యాగ్ పోలీసు స్టేషన్ తీసుకొచ్చి తన నిజాయతీని చాటుకున్నాడు. వివరాలు ప్రకారం ఆత్రేయపురం మండలం ఉచ్చిలి గ్రామానికి చెందిన మానేపల్లి పుష్పవతి బంధువులు ఇంటికి వెళ్లేందుకు శుక్రవారం అదే గ్రామంలో ఆటోలో ప్రయాణం చేసి రావులపాలెంలో బ్యాగ్ మరచిపోయి వెళ్లింది. అయితే ఆటో డ్రైవర్ మండేల శివన్నారాయణ బ్యాగ్‌ను స్టేషన్ లో అందజేశారు. ఎస్ఐ చంటి సిఐ శేఖర్ బాబు సమక్షంలో బ్యాగ్ పరిశీలించి బంగారు వస్తువులు గుర్తించి పుష్పవతికి సమాచారం అందించి బ్యాగ్ బంగారు ఆభరణాలు ఆమెకు అందజేసారు. నిజాయితీని చాటుకున్న ఆటో డ్రైవర్ మండేల శివనారాయణ ను సిఐ అభినందించారు.

జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్క్రీనింగ్ వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

భీమనపల్లిలో రాష్ట్రీయ 'బాల సురక్ష'

ప్రజాశక్తి- ఉప్పలగుప్తం

భీమనపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాల్లో శుక్రవారం స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో విద్యార్థులకు రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. 450 మంది విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు హిమోగ్లోబిన్ శాతం, కంటిచూపు, వినికిడి రక్తహీనత, ఎత్తు బరువు తదితర అంశాలపై స్క్రీనింగ్ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎన్.సత్యనారాయణ, ఆరోగ్య విస్తరణాధికారి ఆర్.రామకృష్ణ మూర్తి, పిహెచ్‌సి సిబ్బంది కె.శుభారత్నం, ఎం.తేజ, ఎన్.రమాదేవి, జె.నాగమణి, అనురాధ, రాణి కుమారి, అరుణ, సత్యవతి, నాగమణి, దుర్గ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - ఆలమూరు

ప్రజా సమస్యలను గుర్తించి త్వరితగతిన ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కార దిశగా పనిచేసేందుకు ఆలమూరు సీనియర్ ప్రెస్ క్లబ్ తీర్మానించింది. ఆలమూరులో జరిగిన ప్రెస్ క్లబ్ సమావేశంలో సభ్యులు పలు అంశాలపై శుక్రవారం చర్చించారు. దీర్ఘకాలిక ప్రజా సమస్యలపై స్పందించడమే మీడియా లక్ష్యంగా పేర్కొన్నారు. మరి ముఖ్యంగా పేదలు, మధ్యతరగతి కుటుంబాల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లాలని సభ్యులంతా ఆమోదించారు. అలాగే ఆలమూరు ప్రెస్ క్లబ్ ద్వారా ప్రజలకు ఎటువంటి మేలు చేయాలనే దానిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ : ఎంఎల్ఎ గిడ్డి

ప్రజాశక్తి - పి.గన్నవరం

డిసెంబర్ 1వ తేదీ ఆదివారం రావడం శనివారం నుంచి పింఛన్లు పంపిణీ చేయమని ఆదేశాలు వచ్చాయని పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లబ్ధిదారులు ఎవరైతే నవంబర్ నెలలో పింఛను తీసుకోలేని వారికి డిసెంబర్ నెల పింఛను కలిపి రెండు నెలల పింఛను సొమ్ము వచ్చిందన్నారు. ఈ నెల ఎవరైనా ఏదైనా కారణం చేత పింఛను తీసుకోలేకపోతే తదుపరి నెలలో ఆ డబ్బులు వచ్చే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందన్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న పింఛను దారులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఎంఎల్ఎ తెలిపారు.

మూడు నెలల పింఛను ఒకేసారి తీసుకునే వెసులుబాటు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వివిధ ప్రాంతాలలో కుటుంబ సభ్యుల ఇంటి వద్ద ఉంటు పింఛను తీసుకొని వృద్ధులు మరియు వికలాంగులు మరియు ఇతర పింఛన్‌దారులకు మూడు నెలలకు ఒకసారి పింఛన్ తీసుకునే వెలుసుబాటు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని శుక్రవారం ఎంపిడిఒ బికెఎస్ఎస్.వెంకట రమణ ఒక ప్రకనటలో తెలిపారు. అదే విధంగా గత నెలలో పెన్షన్ తీసుకోలేని 42 మంది పింఛనుదారులకు శనివారం రెండు నెలలు కలిపి పింఛను ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సైనికుల సంక్షేమానికి తోడ్పాటు అందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - అమలాపురం

సాయుధ బలగాల పతాక దినోత్సవ ఫండ్ కొరకు విరివిగా విరాళా లు అందించి సైనికుల సంక్షేమానికి తోడ్పాటు నందించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందు సాయుధ బలగాల పతాక దినోత్సవ ఫండ్ పోస్టర్‌ను, క్యూ ఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైనికుల సంక్షేమానికి మిలట్రీ వెల్ఫేర్ ఫండ్ కు విరివిగా విరాళాలు అందిస్తూ తమవంతు భాగస్వామ్యం వహించాలని సూచించారు. స్వాతంత్ర్యం పొందిన తరువాత ప్రభుత్వం తన రక్షణ సిబ్బంది సంక్షేమా న్ని నిర్వహించాల్సిన అవసరాన్ని గుర్తించి. డిసెంబర్ 7న ఏటా జెండా దినోత్సవాన్ని పాటించాలని నిర్ణయించిందన్నారు. జెండా దినోత్సవాన్ని పాటించడం వెనుక ఉన్న ఆలోచన సాధారణ ప్రజలకు చిన్న జెండాలను పంపిణీ చేయడం, బదులుగా విరాళాలు సేకరించడమన్నారు. దేశం కోసం పోరాడే సాయుధ దళాల సిబ్బంది కుటుం బాలను మరియు వారిపై ఆధార పడిన వారిని సంరక్షించడం భారతదే శంలోని పౌర జనాభా యొక్క బాధ్యతని భావించినందున జెండా దినోత్సవం మరింత ప్రాముఖ్యతను సంతరించుకుందన్నారు యుద్ధంలో మరణించిన వారి పునరావాసం, సేవ చేస్తున్న సిబ్బంది మరియు వారి కుటుంబాల సంక్షేమం, మాజీ సైనికులు మరియు వారి కుటుంబాల పునరావాసం మరియు సంక్షేమం కొరకు ఈ నిధులు వినియోగిస్తారన్నారు. సాయుధ బలగాల జెండా దినోత్సవం మరియు జెండాల పంపిణీ ద్వారా నిధుల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక్ అధికారి కెప్టెన్ సత్య ప్రసాద్ పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు చర్యలు

జిల్లాలోని వివిధ మేజర్ డ్రెయిన్ల మురికినీరు మూలంగా జలాలు కాలుష్యం కాకుండా నివారణ చర్యలు చేప ట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందు నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హైడ్రాలజీ సైంటిస్ట్ ఆర్ఎస్.రావు అంబేద్కర్ కోనసీమ జిల్లాలో నీటి కాలుష్య ప్రమాణాలపై సర్వే కనుగుణంగా రూపొందించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను కలెక్టర్ తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో భూగర్భ జలాలు వ్యర్థాలు మూలంగా నీటి కాలుష్యం పెరుగుతోందని తెలిపారు. కూనవరం, పాత అయినవిల్లి, దేవగుప్తం వంటి మేజర్ డ్రెయిన్ల మూలంగా కాలుష్యం వ్యాప్తి చెందు తుందని వీటి నివారణకు గుజరాత్ తరహా మాదిరి టెక్నాలజీతో చర్యలు చేపట్టడానికి యోచన చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్య క్రమంలో టి.నరసింహరావు తదితరులు పాల్గొ న్నారు.

భీమక్రోసుపాలెంలో ఏర్పాటుచేసిన పరంజ్యోతి వర్ధంతి సభలో పాల్గొన్న పలువురు నాయకులు

పరంజ్యోతి ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి - రామచంద్రపురం

గుర్రాల పరం జ్యోతి ఆశయ సాధనకు కృషి చేయాలని ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు జె.సత్తిబాబు పిలుపు నిచ్చారు. మండలం లోని భీమక్రోసుపాలెం గ్రామంలో అఖిల భారత రైతు కూలీ సంఘం గ్రామ కమిటీ ఆధ్వర్యం గుర్రాల పరంజ్యోతి 19 వర్ధంతి కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భం గా పరంజ్యోతి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమం లో సత్తిబాబు మాట్లాడుతూ పరంజ్యోతి నిరంతరం పీడిత ప్రజల జీవితాలు మార్పు కోసం వాళ్ల సమస్యలు పరిష్కారం కోసం ఎంతగానో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం గ్రామ కమిటీ అధ్యక్షులు యన్నం నాగేంద్ర కుమార్, సభ్యులు విప్పర్తి సుబ్బలక్ష్మి, పోతురాజు సీత, గుండుపల్లి రాజేశ్వరి, సాధనాల వెంకటలక్ష్మి విప్పర్తి సూరమ్మ, కాలకుర్చ భగవంతుడు, మూడే నానమ్మ తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీ కాలనీలో బాధితులకు భోజనాల పంపిణీ

కుష్టు బాధితులకు భోజనాలు అందజేత

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలోని లెప్రసి కాలనీలో జరిగిన డిపిఎంఆర్ కార్యక్రమానికి హాజరైన కుష్టు బాధితులకు శుక్రవారం భోజనాలను పంపిణీ చేశారు. ఏరుపల్లి సచివాలయంలో ఎఎన్ఎంగా పనిచేస్తున్న సత్యవేణి కుష్టు వ్యాధిగ్రస్తులకు భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా డిప్యూటీ పారమెడికల్ అధికారి మాధవరపు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసిన సత్యవేణి నీ అభినందించారు. అదేవిధంగా రిటైర్డ్ డిపిఎంఒ గొల్లపల్లి కృష్ణ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొంది నా మీకు సేవలు చేయటంలో ఎప్పుడూ ముందుంటామని, ఏ అవసరం వచ్చినా ఫోన్ చేస్తే మీకు కావాల్సిన వైద్య సదుపాయాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎరుపల్లి సచివాలయం సిబ్బంది రిటైర్ అధికారి కృష్ణారావు పాల్గొని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సత్యవేణి అభినందించి ఆమెను స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు అందరూ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

అంగన్‌వాడీలకు పెండింగ్ అలవెన్స్‌లు చెల్లించాలి

ప్రజాశక్తి-కాకినాడ

సంవత్సరం కాలంగా పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీల దారి ఖర్చుల అలవెన్స్ వెంటనే చెల్లించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.చంద్రావతి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అధికారులు సమావేశాల పేరిట పదేపదే అంగన్వాడీలను కార్యాలయాలకు తిప్పుతున్నారని అన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న అంగన్వాడీలకు దారి ఖర్చుల అలవెన్స్ చెల్లించాల్సి ఉన్న బకాయిలు పెట్టి ఇబ్బందులకు గురి చేయడం సరికాదని అన్నారు. ప్రతి నెలా కాకినాడ జిల్లా పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలను ప్రాజెక్టు సమావేశానికి, సెక్టార్ సమావేశానికి రెండుసార్లు అధికారులు పిలుస్తున్నారని తెలిపారు. వీటికి సబంధించి గతంలో ట్రావెలింగ్ అలవెన్స్ ఇచ్చేవారని అన్నారు. గత ఒక సంవత్సరం నుండి పెండింగ్‌లో ఉన్నా చెల్లించడం లేదన్నారు. 42 రోజుల అంగన్వాడీ సమ్మె సందర్భంగా ఒక సమావేశానికి మాత్రమే ట్రావెలింగ్ అలవెన్స్ ఇస్తాని, గతంలో మాదిరి ఇవ్వలేమని జిఒ కూడా ఇచ్చారన్నారు. జిల్లాలోని 1986 అంగన్వాడీ కేంద్రాల వర్కర్లను నెలకు ఒక సమావేశానికి మాత్రమే పిలుస్తామని చెప్పి పదే పదే ఆఫీస్‌లకు పిలుస్తున్నారని తెలిపారు.

నిత్యావసర సరుకులు అందజేస్తున్న తహసీల్దాం, రెడ్ క్రాస్ సిబ్బంది

అగ్ని ప్రమాద బాధితులకు సరుకుల అందజేత

ప్రజాశక్తి - అయినవిల్లి

చింతనలంక జాంబవపేట గ్రామంలో గురువారం సంభవించిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన బాధితులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా సంమకూర్చిన బియ్యం, నిత్యావసర వస్తువులు, దుస్తులను తహశీల్దార్ నాగలక్ష్మమ్మ , గ్రామ సర్పంచ్ చింతలపూడి వెంకటరత్నం చేతులమీదుగా అందించారు ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, రెడ్ క్రాస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

హామీల అమలు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి - మలికిపురం

ఎన్నికల్లో ఎన్‌డిఎ నేతలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు డిమాండ్ చేశారు. మలికిపురం వైసిపి కార్యాలయంలో శుక్రవారం జరిగిన రాజోలు మండల గ్రామ శాఖ అధ్యక్షుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హామీలను అమలు చేయాలని ప్రశ్నిస్తున్న సోషల్ మీడియా కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి వారిని వేధిస్తున్నారని గొల్లపల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కట్టా శ్రీను, తాడి సహదేవ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భీమేశ్వరుని దర్శించుకున్న హైకోర్టు జడ్జి సుజాత

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఎపి హైకోర్టు జడ్జి వి.సుజాత శుక్రవారం ద్రాక్షారామ భీమేశ్వర స్వామి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. జడ్జి సుజాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె వేద పండితుల ఆశీర్వచనాలను అందుకున్నారు. ఆమెకు స్వామివారి తీర్థ ప్రసాదాలను ఆలయ అధికారులు అందజేశారు.

ఆశీర్వచనాలు అందుకుంటున్న హైకోర్టు జడ్జి సుజాత

ఘనంగా లక్షపత్రి పూజ

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం.

స్థానిక అగస్తేశ్వర, పాపవినాశేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారికి లక్ష పత్రి పూజ ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన వై.వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన లక్షపత్రి పూజా కార్యక్రమంలో వేద పండితులు వై.కిరణ్ శర్మ, ఆలయ అర్చకులు కాలదారి కష్ణ భగవాన్, వై.వెంకట రమణ అర్చకత్వంలో పార్వతీ సమేత అగస్తేశ్వర స్వామివారికి లక్ష మారేడు దళాలు తదితర పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి, సిబ్బంది, యాత్రికులు గ్రామస్తులు ,పాల్గొన్నారు.

భూగర్భ జలాల పరిరక్షణకు చర్యలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

పర్యావరణాన్ని కాపాడటం ద్వారా భూగర్భ జలాల పరిరక్షణకు చర్యలు చేపట్టవచ్చని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హైడ్రాలజీ సైంటిస్ట్ డాక్టర్ వైఆర్ఎస్.రావు పేర్కొన్నారు. నగర పంచాయతీ కార్యాలయం నందు శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్‌రావును కమిషనర్ మరియు సిబ్బంది ఘనంగా సత్కరించారు. డాక్టర్ రావు మాట్లాడుతూ భూగర్భ జలాల స్థితిగతులపై నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హైడ్రాలజీ జరిపిన పరిశోధనలను వివరించారు. అడుగంటుతున్న నీటి వనరులను పరిరక్షించుకునేందుకు మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడటంలో పాటు, ప్లాస్టిక్ వినియోగం అదుపు చేయడం ద్వారా నీటి వనరులను సంరక్షించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రవేత డాక్టర్ రావుకు సత్కారం

In Court of the Civil Judge Senior Division, Amalapuram

I.A No. 669/2024 / O.S.NO 64/2019

Between:

Dasireddy Veera Raghavulu S/o Mutyalu Aged 81 years, Agriculture Hindu, R/o D.No.2-26-1, Pappulavari Palem P. Gannavaram Mandalam, Dr.B.R.A.Konaseema District pin:533229

...Petitioner/ Plaintiff

AND

Beera Anasuya (late) W/o Pallayya (వగైరాలు)

D-3: Beera Satyanarayana Murthy, S/o Pallayya, Aged about 56 years, D.No.3-53, Dan Center, Papppurlavari palem P. Gannavaram Mandala, Dr.B.R.A.K District 533229

D-4: Beera Srinivasa Rao, S/o Pallayya, Aged about 50 years, -DO-

D-5: Salladi Raja Lakshmi, D/O Pallayya, Aged about 54 years, -DO-

D-6: Petta Bharati, D/O Pallayya, Aged about 52 years, -DO- ***...Defendants***

పై నెంబరు దావాలో మూడవ ప్రతివాది నుండి 6వ ప్రతివాదులు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా సమన్లు నోటీసులు పంపించినను మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు నిమిత్తం **దీ. 17-12-2024 సం॥ తేదిన వాయిదా వేసినారు మీరు ఆ రోజున ఉదయం గం॥ 10-30 ని॥లకు** స్వయంగా గాని మీ వకీలు ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరయ్యి మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడుననీ రూఢీగా తెలియపరచడమైనది.

సయ్యద్ హమీద్ పాషా

అమలాపురం — అడ్వకేట్, అమలాపురం

28-11-2024 — సెల్: 9490786161